షెడ్యూల్డ్ కులాల రోస్టర్ పాయింట్లు తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో షెడ్యూల్డ్ కులాల వారికి అమలు చేస్తున్న రోస్టర్ పాయింట్లను అసెంబ్లీ కమిటీ ప్రతినిధులు శాఖల వారీగా తనిఖీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీ ప్రతినిధులుగా విచ్చేసిన అసిస్టెంట్ సెక్రటరీ ఈశ్వర రావు, ఎస్ఒలు వెంకటేశ్వర్లు, ప్రసాద్ పలు శాఖలకు చెందిన రికార్డులను పరిశీలించి రోస్టర్ పాయింట్లను తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలనలో గుర్తించిన అంశాలను కమిటీ ముందు పెడతామని అసిస్టెంట్ సెక్రటరీ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ గణపతి రావు, సోషల్ వెల్ఫేర్ డిడి సుధాకర్ రావు, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, పలు శాఖల పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెట్టుబడి వేలల్లో మద్దతు ధర వందల్లో

ఓవైపు భారీగా పెరిగిన పెట్టుబడి... మరోవైపు స్వల్పంగా పెరిగిన ధాన్యం ధర... ధాన్యం దిగుబడీ అంతంతమాత్రమే. దీంతో, అందరికీ అన్నంపెట్టే రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఎప్పటి మాదిరిగా ఈ ఏడాది కూడా ధాన్యపురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి దాపురిస్తోంది.

- దిగుబడి అంతంతమాత్రమే
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కలిసి సుమారు 4లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. గతంతో పోలిస్తే పెట్టుబడి ఎక్కువగానే పెరిగింది. విత్తనం, నారు, నీరు, దుక్కి, దమ్ము, ఎరువులు, పురుగుల మందులు, కలుపుతీయడం, కోతలు, మోతలు, నూర్పుల పెట్టుబడి, శ్రమ కలిపి ఎకరాకు సుమారు రూ.45వేల నుంచి రూ.50వేల వరకు మదుపు అవుతోందని రైతున్న లెక్క కడుతున్నాడు. ఇందులో ఈ ఏడాది పెరిగిన మదుపు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఉంది. ముఖ్యంగా ఎరువుల ధర, ట్రాక్టర్ అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయి. ఎకరా విస్తీర్ణానికి యూరియా రెండు బస్తాలు, పొటాష్, పాస్ఫేట్ ఒక్కొక్క బస్తా వేశారనుకుంటే నాలుగైదువేలు ఖర్చవుతోంది. ఇక నారుపోతకు అదును మొదలుకుని దుక్కి, దమ్ము వరకు ట్రాక్టర్ అద్దెకు కూడా అంతకన్నా ఎక్కువే. ఇటీవల కాలంలో పెట్రోల్, డీజిల్ ధరల అమాంతంగా పెరిగిపోవడం ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. అయినా నేలతల్లిని నమ్ముకుని వున్న రైతులు సాగుకోసం అప్పులు చేసుకుంటూ పంట పండించారు. ఇటువంటి పరిస్థితుల్లో అందుకనుగుణంగా ధర పెంచాల్సిన కేంద్ర ప్రభుత్వం అత్తెసరుతో సరిపెట్టింది. సాధారణ రకం క్వింటాకు రూ.2040, ఎ-గ్రేడ్ రూ.2060 చొప్పున ధర నిర్ణయం చేసింది. గతంతో పోలిస్తే పెంచిన ధర అక్షరాల వంద రూపాయలు మాత్రమే. మరోవైపు దిగుబడి కూడా పెద్దగా పెరగలేదు. విజయనగరం జిల్లాలో ఇప్పటివరకు 27శాతం వరి కోతలు పూర్తికాగా, 666చోట్ల పంటకోత ప్రయోగాలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో సగటున 21క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రానున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో 90శాతం సాధారణ రకంగానే గుర్తించడం ఏళ్ల తరబడిన చరిత్ర. దీన్నిబట్టి ఎకరా వరి సాగులో రూ.42,840 మాత్రమే. దీన్నిబట్టి రైతులకు మిగిలిందేమీ లేదన్నది స్పష్టమౌతోంది. ఈనేపథ్యంలో తమను ఆదుకోవాలని రైతులు, వారి తరపున రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో అన్నదాత కన్నీరు తుడవాల్సిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలుపైనే తగిన భరోసా ఇవ్వలేని పరిస్థితి దాపురిస్తోంది.

ఎకరాకు రూ.44,950 పెట్టుబడి

ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేయడానికి ఈ ఏడాది నాకు రూ.44,950 మదుపు అయ్యింది. ఇందులో విత్తనాలు కొనుగోలు మొదలుకుని దుక్కి, ఎరువులు, పురుగు మందులు సహా 25రకాల ఖర్చులు ఉన్నాయి. ముదుపంతా అప్పుచేసి పెట్టాను. దానికి మూడు నెలల వడ్డీకూడా లెక్కించాల్సి వచ్చింది.

వసంత సుధీర్, వరి రైతు
బుడతనాపల్లి, గంట్యాడ మండలం

సమస్యల్ని పరిష్కరించుకుంటూ లక్ష్యాలను చేరుకుందాం

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్
- గుంకలాం జగనన్న కాలనీ సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల పథకం తాలూక ఫలాలు ప్రతి పేదవాడికీ అందాలంటే.. మన పరిధిలో ఉన్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్దామని, లక్ష్యాలను చేరుకుందామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. అనుకున్న లక్ష్యాలను, నిర్ణీత కాలంలో చేరుకోవాలంటే జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని నిర్దేశించారు. విజయనగరం, పార్వతీపురం జిల్లా కలెక్టర్లకు అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. జగనన్న పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ రాష్ట్రంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల గురించి, సాధించిన ప్రగతి గురించి వివరించగా విజయనగరం, పార్వతీపురం జిల్లా కలెక్టర్లు ఎ. సూర్యకుమారి, నిశాంత్ కుమార్ ముందుగా ఆయా జిల్లాల్లో జరిగిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని వివరించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ముందుగా జిల్లాల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, అప్పటికీ పరిష్కారం కాకపోతే రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా రెండు జిల్లాలకు కేటాయించిన ఇళ్లను పూర్తి చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. పనుల్లో మరింత జోరు కనిపించాలని, మరో రెండు నెలల్లో వీలుంటే జిల్లాలో పర్యటిస్తానని తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశాలను, ఆశయాలను అర్థం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను ఒక మహా యజ్ఞంలా సాగించాలని పేర్కొన్నారు.

మంత్రి దృష్టికి పలు అంశాలు

ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు గృహ నిర్మాణాల్లో ఉన్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, రెండు జిల్లాల కలెక్టర్లు ఎ.సూర్యకుమారి, నిశాంత్ కుమార్, విజయనగరం, అరకు ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీలు సురేశ్ బాబు, రఘురాజు, విక్రాంత్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, కంబాల జోగులు, కళావతి, జాయింట్ కలెక్టర్లు మయూర్ అశోక్, ఒ.ఆనంద్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేస్తాం

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కృషి చేస్తున్నామని మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిని చూసిన తరువాతే, ప్రతిపక్ష నేతలు మాట్లాడాలని మంత్రి సూచించారు. కళ్లబొల్లి కబుర్లతో ప్రజల మనసుల్లో విషబీజాలు నాటడానికి ప్రయత్నించొద్దని వారికి హితవు పలికారు. గుంకలాం వద్ద రూపొందించిన జగనన్న కాలనీని మంత్రి సందర్శించారు. సిమ్మెంటు ఇటుక, పేనల్స్ తయారీ పరిశ్రమను సందర్శించి, ఉత్పత్తి పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గుంకలాంలో సుమారు 10,600 మందికి ఇళ్లు మంజూరు చేయగా, ఇళ్ల నిర్మాణం జోరుగా జరుగుతోందని చెప్పారు. కొద్ది రోజుల క్రితం ఈ లేఅవుట్‌కు వచ్చిన జనసేన నేత పవన్ కల్యాణ్‌కు, జరుగుతున్న ప్రగతి కనిపించలేదా అని ప్రశ్నించారు. లేఅవుట్‌లో జరుగుతున్న ప్రగతిని పరిశీలించకుండా, చౌకబారు విమర్శలకు దిగారని ధ్వజమెత్తారు. పర్యటనలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సిలు డాక్టర్ పి.రమేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్.రమాదేవి, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ దొరబాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెఎండి శివప్రసాద్, జెసి మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్యకళ, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు, హౌసింగ్ పీడీ ఎన్‌వి రమణమూర్తి, ట్రాన్స్‌కో ఎస్ఇ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

సిపిఎస్ రద్దుకు యుటిఎఫ్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం కోట జంక్షన్‌లో ఉపాధ్యాయులు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న సిపిఎస్ విధానాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒపిఎస్‌కు బదులు జిపిఎస్‌ను తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పడం సరైనది కాదని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.సత్య శ్రీనివాస్, ఎన్జీవో సంఘం నుంచి జి.పైడిరాజు, టి.శ్రీధర్‌బాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.ప్రసాద్ రావు, వాసు సూర్యారావు, త్రినాధరావు, రాజారావు, రాధా భవాని, శ్రీదేవి, కృపానంద్ , నిర్మల, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాని తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి

దత్తిరాజేరు : మండలంలోని బూర్జివలస పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఎస్‌పి ఎం.దీపిక పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను, సిడి ఫైల్స్ ను తనిఖీ చేశారు. కేసు ప్రాపర్టీని, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసు సిబ్బంది, అధికారులు, మహిళా సంరక్షణ పోలీసులు విధిగా గ్రామ సందర్శన చేయాలని, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాల సమాచారం సేకరించి, రైడ్స్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట బొబ్బిలి డిఎస్‌పి బి.మోహనరావు, గజపతినగరం సిఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ • అట్టహాసంగా ప్రారంభమైన సిఎం కప్ క్రీడా పోటీలు

కబడ్డీ ఆడుతూ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

క్రీడల ద్వారా యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. గ్రామీణ యువతలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే జగనన్న క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇలాంటి క్రీడల్లో జిల్లా యువత భాగస్వామ్యం కావటం ద్వారా మంచి భవిష్యత్తును పొందాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. సిఎం కప్ పేరుతో రాజీవ్ మైదానంలో రెండురోజులు పాటు జరిగే జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్‌పి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తోందని అన్నారు. ఫలితంగా ఇప్పటికే జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని భావితర క్రీడాకారులు కూడా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులు వ్యక్తిగతం తగిన సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్‌పి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్సీలు కబడ్డీ మొదటి ఆడి క్రీడలను ప్రారంభించారు. కబడ్డీలో బాలికల విభాగంలో నెల్లిమర్ల నియోజకవర్గం విజేతంగా నిలిచింది.

జిల్లా, జోనల్ స్థాయి పోటీల షెడ్యూల్

సిఎం కప్ పేరుతో నిర్వహిస్తున్న క్రీడా సంబరాల్లో భాగంగా జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంటు పోటీలు రాజీవ్ మైదానంలో జరుగుతాయని సెట్విజ్ సిఇఒ, డిఎస్‌డిఒలు పేర్కొన్నారు. విజ్జీ స్టేడియంలో క్రికెట్ కేవలం పురుషులకు మాత్రమే జరుగుతుందని వివరించారు. జోనల్ స్థాయి పోటీల్లో భాగంగా డిసెంబర్ 6, 7వ తేదీల్లో విజ్జీ స్టేడియం వేదికగా క్రికెట్, డిసెంబర్ 8, 9వ తేదీల్లో ఇండోర్ స్టేడియం వేదికగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి, జిల్లా కబడ్డీ అసోషియేషన్ ప్రెసిడెంట్ కౌశిక్, జిల్లా యువజన అధికారి విక్రమాధిత్య, సెట్విజ్ సిఇఒ రామానందం, డిఎస్‌డిఓ అప్పలనాయుడు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కబడ్డీలో విజేతగా నిలిచిన నెల్లిమర్ల నియోజకవర్గం జట్టు

ఓటరు జాబితాలో అక్రమాలను చూపుతున్న సిపిఎం నాయకులు

ఓటరు నమోదులో అక్రమాలు సరిదిద్దాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమంలో జరిగిన అక్రమాలను సరిదిద్దాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మి నేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయంపై స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి కూడా అందజేశామని తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు జాబితాలో బూత్ నెంబర్ 86 బొబ్బిలిలో 16 మంది చదువు లేని వారిని, 5,7,10, తరగతి చదివిన వారికి కూడా ఓటరు నమోదు చేశారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా వ్యహరిస్తున్నారని అన్నారు. వెంటనే అక్రమాలను సరిదిద్దకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మీ పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే ఎస్‌విసిహెచ్ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం రంగరాయపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను నెరవేర్చిన హామీలను ఇంటింటా వివరిస్తూ ప్రజల సమస్యలపై ఆరా తీశారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ధ్యేయమని అన్నారు. చేశారు.

టీచర్ల ముందుస్తు అరెస్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్

విజయవాడలో గురువారం జరగబోయే యుటిఎఫ్ ధర్నాకు హాజరు కాకుండా జిల్లాకు చెందిన పలువురు యుటిఎఫ్ నాయకులను రూరల్ పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, గరుగుబిల్లి మండల ప్రధాన కార్యదర్శి తంగుడు శ్రీను, సీతానగరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒమ్మి రామకృష్ణ, పల్లి శ్రీనివాసులను ముందస్తుగానే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. సాయంత్రం విజయవాడకు వెళ్లే అన్ని ప్రైవేటు బస్ సర్వీస్‌లు ముగియడంతో నాయకులను విడుదల చేశారు.

క్రీడా దుస్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ క్రీడా దుస్తులను ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య మంగళవారం ప్రదీప్ నగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నారని అన్నారు. క్రీడలకు ఎంతో ప్రోత్సహాన్ని అందిస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆయన జన్మదినం సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి విజయకేతనం ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసి నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు గురునాయుడు, బాలకృష్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖలీల్ బాబు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక సూఫీ పుణ్య క్షేత్రం హజరత్ ఖాదర్ వలీ బాబా దర్గా వ్యవస్థాపక అధ్యక్షులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా తనయుడు డాక్టర్ మహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ సాబ్రీ(ఖలీల్ బాబు) పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం అర్ధరాత్రి ఖలీల్ బాబు పెద్ద కుమారుడు అహ్మద్ బాబు తమ బృందంతో కలిసి ఆయనకు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి తమ సంతోషాన్ని చాటుకున్నారు. మంగళవారం ఉదయం ఎటికె వెలుగు వృద్ధాశ్రమంలో పుష్పగిరి కంటి హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి విద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ శశి భూషణ్ రావుతో కలిసి ఖలీల్ బాబు ప్రారంభించారు. నిరుపేదలకు, వృద్ధులకు ఖలీల్ బాబు దుప్పట్లు, వస్త్రాలను పంపిణీ చేశారు. ఎటికె వెలుగు ఆశ్రమంలోని వృద్ధులకు, డబుల్ కాలనీలో గల కెజిబివి విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. కెజిబివి విద్యార్థినుల్లో పోటీతత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో పది, ఇంటర్ పరీక్షల్లో టాపర్ గా నిలిచిన వారికి తమ సంస్థ ద్వారా సత్కరిస్తూ, బహుమతిని కూడా ఇస్తామని ఖలీల్ బాబు ప్రకటించారు. సిఐ (విఆర్) మంగవేణి, బిఎ రావు దంపతులు కూడా కెజిబివిలో చదివే నిరుపేద విద్యార్థిని ఒకరికి వచ్చే ఏడాది ఎటువంటి ఫీజు లేకుండా తమ సుజాత విద్యా సంస్థలో పూర్తి ఉచితంగా ఉన్నత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు.

క్షయ రోగులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

మండలంలోని ద్వారపూడి సచివాలయంలో ప్రధానమంత్రి క్షయ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇద్దరు క్షయ రోగులకు గ్రామ సర్పంచ్ యజ్జల ఆదిలక్ష్మి, ఎంపిటిసి మృణాళిని ఇద్దరు క్షయ రోగులకు పోషకాహారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వి.శ్రీనివాసరావు, గ్రామపెద్ద బొద్దల నర్సింగరావు. రామోలు. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా క్షయ నివారణ విభాగం హెల్త్ సూపర్‌వైజర్ జి.పైడిరాజు, వీరాస్వామి, ద్వారపూడి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, హెల్త్ సెక్రటరీ శాంతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

గురజాడ భావి తరాలకు స్ఫూర్తి

ప్రజాశక్తి -విజయనగరం కోట

భావి తరాలకు స్ఫూర్తి గురజాడ అప్పారావు అని ఆ వంశీయులు గురజాడ రవీంద్రుడు అన్నారు. గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గురజాడ అప్పారావు స్వగృహంలో 'కథా మంజరి - ప్రకాశికా' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ముందుగా గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, నాటక రంగం పట్ల మక్కువ కలిగి అందరూ గురజాడ అప్పారావు భావజాల వ్యాప్తికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గురజాడ దేశభక్తి గీతాల పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు జిఎస్ చలంను సత్కరించారు. కార్యక్రమంలో గురజాడ కుటుంబీకులు ఇందిర, వెంకటేశ్వర ప్రసాద్, ఎస్ఎస్-ఎస్ఎస్ రాజు, పద్మనాభం, జక్కు రామకృష్ణ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గురజాడ ఫౌండేషన్ సభ్యులు

గురజాడ అడుగుజాడల్లో నడవాలి

విజయనగరంటౌన్ : గురజాడ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన అడుగు జాడల్లో నేటి తరం యువత నడవాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. విజయ దుర్గ యూత్ సొసైటీ , గురజాడ ఫౌండేషన్ అమెరికా ఆధ్వర్యంలో గురజాడ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగిన గురజాడ వర్ధంతి వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గురజాడ వర్ధంతి పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆమె బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక అంశాలను వనరులుగా మలుచుకొని చేసిన ఆయన రచనలు జిల్లాను పునీతం చేశాయని పేర్కొన్నారు. గురజాడ తన రచనలతో సమాజాన్ని మేల్కొల్పారని, భావితరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో గురజాడ కుటుంబ సభ్యులు రవీంద్రుడు, ఇందిర, మన్యం జిల్లా నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవిఆర్ కృష్ణాజి, పాఠశాల కరస్పాండెంట్ స్వరూప, విజయ దుర్గ యూత్ సొసైటీ అధ్యక్షులు కేశవపట్నం చంద్రిక, సభ్యులు రాణి, పూర్ణ, రాకేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పతివాడ రమణ - మీసాల రామారావు

ప్రజాశక్తి-డెంకాడ

ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) నెల్లిమర్ల నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆ యూనియన్ నియోజకవర్గ విలేకర్ల సమావేశం మంగళవారం ఎం.రామారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. అర్హులకు అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు యూనియన్ ఆధ్వర్యాన వినతులు అందజేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మండలంలోనూ ప్రభుత్వం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కమిటీ ఎన్నిక జరిగింది. 8 మందితో నూతన కార్యవర్గం ఎన్నిక కాగా, అధ్యక్షులుగా పతివాడ రమణ (నెల్లిమర్ల), కార్యదర్శిగా ఎం.రామారావు (డెంకాడ) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని జర్నలిస్టులంతా అభినందించారు.

బోరు ప్రారంభం అభినందనీయం

నెల్లిమర్ల : మిరాకిల్ సంస్థ మంచి నీటి బోరు ప్రారంభించడం అభి నందనీయమని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. మంగళ వారం రామతీర్థం జంక్షన్‌లోని డానియల్ చర్చి వద్ద మిరాకిల్ మినిస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్‌విఎన్ మూర్తి విశాఖపట్నం ఆధ్వర్యంలో మంచినీటి బోరును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మిరాకిల్ సంస్థ మంచినీటి దాహాన్ని తీర్చడానికి బోరును వేయించడం అభినంద నీయమని కొనియాడారు. అనేక ప్రాంతాలలో మంచినీటికి ఇబ్బంది పడుతున్నారని ఆయా ప్రాంతాల్లో మిరాకిల్ సంస్థ ద్వారా బోర్లు వేసి మంచినీటి కొరతను తీర్చాలని కోరారు. దీనిపై సంస్థ ప్రతినిధులు ఇంకా తమ సంస్థ ద్వారా అనేక ప్రాంతాల్లో మంచినీటి దాహం తీర్చడానికి బోర్లు వేయిస్తామని తెలిపారు. కాగా గుర్ల గ్రామం, మండలంలో పెద్దతరిమి గ్రామంలో కూడా మంచినీటి బోరును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు సంతోష్, స్టీఫెన్ పాల్, సురేష్, దానియేలు, యోసేపు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

శృంగవరపుకోట : పట్టణంలోని గ్రామ దేవత దార గంగమ్మ తల్లి దేవాలయం వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు పుణ్యగిరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, కార్యనిర్వహణాధికారి కె.నాగేంద్ర, పురోహితులు భాస్కరశర్మ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల వద్ద నిఘా ఏర్పాటు

రామభద్రపురం : ఇటీవల ప్రభుత్వ మద్యం దుకాణాల పై దాడులు పెరుగుతున్న దృష్ట్యా మండలంలో నిర్వహిస్తున్న అన్ని దుకాణాల వద్ద పటిష్ట నిఘా ఏర్పాట్లు చేస్తామని ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పలు దుకాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం లావేరు మద్యం దుకాణం వద్ద దోపిడీ జరగడంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. దుకాన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. నిఘాతో పాటు రాత్రి ఘస్తీ ముమ్మరంగా చేస్తామన్నారు.

ఎన్‌సిసి విద్యార్థుల ఎంపిక

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విభాగం 13 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు అధ్యక్షతన ఎన్‌సిసి సెలక్షన్లను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం 13 ఆంధ్ర బెటాలియన్ నుంచి హవల్దార్లు సురేంద్ర ప్రసాద్, నాయక్ రోషన్ లాల్‌లు విద్యార్థులకు శారీరక ధృఢత్వం, రన్నింగ్‌లో ప్రతిభ చూపిన 19 మంది విద్యార్థులను ఎన్‌సిసి క్యాడేట్స్‌ను ఎంపిక చేశారు. కళాశాల ఎన్‌సిసి కేర్ టేకర్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడేట్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండో పంటగా మొక్కజొన్న : ఎఒ

బొబ్బిలిరూరల్ : ఖరీఫ్ వరి పంట కోసిన తరువాత రెండవ పంటగా మొక్కజొన్న వేయాలని ఎఒ శ్యాం సుందర్ అన్నారు. మంగళవారం అలజంగి గ్రామంలో వరి కోసిన తర్వాత దుక్కి దున్నకుండా జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న పంట వేయడం పై ఆయన రైతుకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వరి కోసిన తర్వాత ఎటువంటి దుక్కి దున్నకుండా పదును మీద మొక్కజొన్న విత్తనాన్ని వరుసలలో వేసుకుంటూ విత్తనం వేసిన 24 గంటల్లో కలుపు మందు పిచికారి చేసుకోవాన్నారు. ఈ విధానం వల్ల ఖర్చులు దాదాపుగా రూ.4వేలు తగ్గడమే కాకుండా దిగుబడిలో ఎటువంటి తేడా లేకుండా రైతుకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు పైన వేణు, వ్యవసాయ సహాయకులు లత, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

వేపాడ : మండలంలోని కరకవలస, చామలాపల్లి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ జి శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న మెనూ సక్రమంగా అందుతున్నది లేనిది పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేటప్పుడు యూనిఫారం ధరించే విధంగా తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. ఈ పరిశీలనలో ఎంఇఒతో పాటుఉ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.కోట జట్టుకు ప్రథమ స్థానం

కొత్తవలస: విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి ఎపి సీఎం కప్ వాలీబాల్ మహిళల విభాగంలో శృంగవరపుకోట నియోజకవర్గం మొదటి స్థానం సాధించిందని నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంచార్జి కె. కృష్ణంరాజు తెలిపారు. ఈ వాలీబాల్ పోటీలు విజయనగరం జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా టీం త్వరలో జరగనున్న జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులను ఆయన మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ జాతీయ రిఫరీ ఎల్‌జిఎన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై 1930కు ఫిర్యాదు చేయండి

రేగిడి: బ్యాంకు ఖాతాలో నగదు పోయినా, యాప్‌ల ద్వారా రుణాలు ఇస్తానని నమ్మ బలికి సైబర్ నేరాలకు పాల్పడినా 1930 నెంబరుకు సకాలంలో ఫోన్ చేసినా, నేరుగా సంప్రదించినా స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఇ. శ్రీనివాసరావు తెలిపారు. బూరాడ గ్రామంలో రాజాం- పాలకొండ ప్రధాన రహదారిలో సైబర్ నేరాలపై ఫెక్స్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌ల ద్వారా ఎటువంటి పత్రాలు లేకుండా అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని మెసేజ్‌లు వస్తాయన్నారు. ఫోన్ యాప్ నుంచి లోన్లు తీసుకుంటే కుటుంబ సభ్యులకు వేధింపులు, కష్టాలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

తేనెటీగల దాడి బాధితులకు పరామర్శ

రేగిడి : మండలంలోని కందిస గ్రామంలో తేనెటీగల దాడిలో 8 మంది ఉపాధి హామీ పథకం కూలీలు గాపడిన విషయాన్ని తెలుసుకుని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు రాజాం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తేనెతీగల దాడిలో 8 మంది ఉపాధి కూలీలు అస్వస్థతకు గురయ్యారని, వీరందరు వైద్యంతో క్రమేపి కోలుకుంటున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని వెల్లడించారు.

రైల్వే స్టేషన్లో భారీ బందోబస్తు


పహారా కాస్తున్న పోలీసులు

బొబ్బిలి : స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఓబిసి రిజర్వేషన్లలో అన్యాయం జరగడంతో జాతీయ వెనుకబడిన తరగతుల ఫ్రంట్ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో రైల్వే స్టేషన్‌లో ఎటువంటి ఆందోళనలు జరగకుండా నివారించేందుకు రైల్వే పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బందోబస్తు చేపట్టారు.

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - వేపాడ

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు అవసరమని ఎంపిపి దొగ్గ సత్యవంతడు అన్నారు. మండలంలోని వల్లంపూడి, సోంపురం, సింగరాయి సచివాలయాల పరిధిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, ఎంపిటిసి ఆకుల సత్తిబాబు, సర్పంచులు మురిపిండి గంగరాజు, నిరుజోగి వెంకటరావు, నాయకులు బొడ్డు శ్రీను, వీలుపర్తి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం అరిగిపాలెం గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, నాయకులతో ఎంపిపి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో దుల్ల వెంకట్రావు, దుల్ల సన్యాసిరావు, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జామి : గత పొరపాట్లను సరిదిద్ది, ఈ ఏడాది పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, రైతులు ఒక్క ధాన్యపు గింజనూ మిల్లరకు అదనంగా ఇవ్వాల్సిన పని లేదని జెడ్‌పిటిసి గొర్లె సరయు అన్నారు. మంగళవారం మండల మహిళా సమైఖ్య భవనంలో వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపిపి అరుణతో పాటు పాల్గొని ఆమె ప్రసంగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలుకు రైతులు సమాయత్తం అవ్వాలని పిలునిచ్చారు. ఎఒ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, మండలంలో ఆర్బికేలను ఏ,బి,సి కేటగిరులుగా విభజించి, సపోర్టింగ్ ఏజెన్సీల ద్వారా కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు గన్ని బ్యాగుల, వాటిని మిల్లుకు తరలించే రవాణా వాహనాలను ఆర్బికెలలో టెక్నికల్ అసిస్టెంట్లు చూస్తారన్నారు. ఈ సారి గన్ని బ్యాగులో 40.5 కేజీలు, ప్లాస్టిక్ సంచిలో 40కేజీలు ధాన్యం మాత్రమే నింపి, మిల్లరుకు పంపాల్సి ఉంటుందని అన్నారు. అందుకు హమాలి చార్జీలు కింద క్వింటాకు రూ.25, 8 కిలోమీటర్ల లోపు రవాణా చార్జీలు కింద రూ.295 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వీటికి ధాన్యం డబ్బులతో పాటు 21రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాకు చెల్లించడం జరుగుతోందని అన్నారు.

వేపాడ: సమావేశంలో మాట్లాడతున్నఎంపిపి దొగ్గ సత్యవంతుడు

మండలానికి లక్ష గన్ని బ్యాగుల అవసరం కాగా, ఇప్పటికే 17వేలు ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఒకవేళ రైతులే గన్నీ బ్యాగు ఏర్పాటు చేసుకుంటే, బ్యాగుకు రూ.3.30 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మిల్లరుతో సమస్యలు పరిష్కరించేందుకు సిఎస్‌డిటిలు కస్టోడియన్ అధికారిగా ఉంటారని, ప్రజాప్రతినిధులతో సమన్వయ పరిచుకొని కొనుగోలు సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సతీష్, డిప్యూటీ తహశీల్దార్ సునీత, సి ఎస్‌డిటి ఇందిరా, వైస్ ఎంపిపిలు విజయలక్ష్మి, జి.వెంకటరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల : ధాన్యం కొనుగోలు పై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి సీర అప్పల నాయుడు, వైసిపి మండల నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, జిల్లా పసుగణాభివృద్ధి చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కెంగువ మధుసూదనరావులు హాజరై ధాన్యం కొనుగోలుపై చర్చించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సొసైటీ సిబ్బంది ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలన్నారు. కొనుగోలులో ఎటువంటి అవకతవకలూ జరగకూడదన్నారు. ఆర్బికెలలో ఉన్న విఎఎ పని ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో నీటి కొరత

ప్రజాశక్తి- మెరకముడుదాం

ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న లే అవుట్లలో నీటి కొరత ఉందని మెరకముడిదాం ఎంపిపి తాడ్డి కృష్ణవేణి భర్త, మండల వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందగా ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వై.గోవిందరావు మండలంలో ప్రతి పంచాయతీలో జరుగుతున్న మంచి నీటి సరఫరా గురించి వివరిస్తుండగా వైసిపి నాయకులు వేణుగోపాలరావు కలుగుజేసుకుని మేజర్ పంచాయతీ గర్భాంలో జరుగుతున్న జగనన్న లే అవుట్లలో నీటి సమస్య గురించి ప్రశ్నించారు. సుమారు 30 ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా నీటి సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు జాప్యం జరుగుతోందన్నారు. వెంటనే స్పందించిన జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యను రెండ రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలో ఇంటింటికి కులాయి ద్వారా తాగు నీరు సరఫరా చేయటంలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఇంటింటికి తాగు నీరు సరఫరా చేసే ప్రతి ఇంటి నుండి ప్రతినెలా రూ.30 వసూలు చేసి ఆ సొమ్మును గ్రామ కమిటీ తరుపున బ్యాంకు అకౌంట్‌లో వేయాలని సూచించారు. జగనన్న ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని డిసెంబర్ 21 తేదీ నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని తెలియ చేశారు. సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలు సరిగా ఉండటం లేదని తన దృష్టికి వచ్చిందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రజలకు అందుబాటలో ఉండాలన్నారు. ఈ సమావేశలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపి టి. హరిబాబు, కందుల పార్వతి, ఎంపిడిఒ పి. రామకృష్ణ, తహశీల్దార్ రత్న కుమార్, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సర్వ సభ్య సమావేశంలో వెల్లడించిన సభ్యులు

ఆర్‌డబ్ల్యుఎస్ డిఇను ప్రశ్నిస్తున్న జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు

రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం

ప్రజాశక్తి- గరివిడి

సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

రానున్న ఎన్నికల్లో చీపురుపల్లిలో తెదేపా విజయం ఖాయమని తెలుగుదేశం పార్టీ విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. నియోజకవర్గ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం, గుర్ల మండలాలకు చెందిన టిడిపి బూత్ కన్వీనర్లతో చీపురుపల్లిలో నాగార్జున తన నివాసంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకీ అసంతృప్తి పెరిగిపోతుందన్నారు. అన్ని వర్గాల వారూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదని అన్నారు. దీంతో ఉపాధి లేక నిరుద్యోగ యువత విలవిలలాడుతన్నారన్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ కన్వీనర్లు చురుగ్గా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, దన్నాన రామ చంద్రుడు, సారేపాక సురేష్ బాబు, మహంతి రమణ మూర్తి, మహంతి అప్పలనాయుడు, ముల్లు రమణ, యజ్జిపరపు సత్యం, అరతి సాహు, రౌతు నారాయణ రావు, తాడ్డే శ్రీధర్, పిన్నింటి సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - గుర్ల

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కేసలి అప్పారావు

మండలంలోని వల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్న బోజనాలను పరిశీలించి, అంతరం విద్యార్థులను పాఠ్యాంశాలు వారీగా విద్య బోధన గురించి అడిగి తెలిసికొని, వారి ప్రమాణాలను గుర్తించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా అప్పారావు మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో సమతుల్య పౌష్ఠిక ఆహారాన్ని అందిస్తున్నారని, వాటినీ బాలలకు అందించడంలో, ఎటువంటి లోపాలూ లేకుండా చూడాల్సిన బాధ్యత పాఠశాల కమిటీలు, గ్రామ స్థాయి సచివాలయం సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులుపై ఉందని సూచించారు. ప్రభుత్వం పిల్లలు విషయంలో అధిక ప్రాధాన్యతను ఇస్తూ విద్యా, వైద్యం కోసం అధిక నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. బాలల యొక్క చదువు, వైద్యం విషయంలో తల్లి దండ్రులకు భారం కాకుండా ప్రభుత్వం అన్ని రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తోందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి ఎస్ భాను ప్రకాష్, సర్పంచ్, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, పాఠశాల కమిటీ, హెచ్‌ఎం వడ్డాది అప్పారావు, ఉపాద్యాయ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలే ఆవిష్కరణలకు పట్టుకొమ్మలు

ఎపి ఇన్నోవేటివ్ సొసైటీ సిఇఒ అనిల్ కుమార్

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

నెల్లిమర్ల : విద్యార్థులు నూతన అధునాతన ఆవిష్కరణలు అందిపుచ్చు కోవాలని, కళాశాలలే ఆవిష్కరణలకు పట్టుకొమ్మలని ఎపి ఇన్నోవేటివ్ సోసైటీ సిఇఒ తెంటు అనీల్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.నరసింహరావుతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో శక్తి ఉత్పాదక రంగాలదే పైచేయి కానుందన్నారు. ఇప్పటికే ఇన్నోవేటివ్ సోసైటీ వివిధ సంస్థలకు సహకారం అందించిందన్నారు. కేవలం సెమి కండక్టర్ల రంగంలోనే రూ.15వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.నరసింహరావు మాట్లాడుతూ 2030 నాటికి భారత్ 6 ట్రిలియన్ల సంపదకు నిలయంగా మారబోతుందన్నారు. విద్యా వ్యవస్థలో వస్తొన్న మార్పులకు అనుగుణంగా తమ మెదడుకు పదునుపెట్టాలన్నారు. అంకుర పరిశ్రమలు స్థాపించే దిశగా ముందడుగు వేయాలన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్ నైపుణ్య విద్యకు పేరొందిందని, విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు అండగా ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాంతీయ మేనేజర్ బిజయ్ కుమార్ సాహు మాట్లాడుతూ ఒయో హెటళ్ళ అధినేత రితేష్ అగర్వాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు చేతుల మీదుగా అతిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒఇటి డీన్ ప్రొఫెసర్ కె.కృష్ణమూర్తి, బిబిఎ విభాగాధిపతి మధుస్మిత చౌదరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, బిబిఎ, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు..

ఉత్తరాపల్లిలో ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పరిధిలో గల ఉత్తరాపల్లి సచివాలయంలో ఫ్యామిలీ ఫీజిషియన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిభిరం నిర్వహించారు. వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి. సింహాద్రి నాయుడు, డాక్టర్ టి. వెంకటరావులు 52 మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు హెచ్.ఎస్. రాము తెలిపారు. పెరాలిసిస్, గుండె జబ్బులు, ఆరోగ్య శ్రీ కేసులు, గర్భిణులు, బాలింతలకు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి వైద్య సేవలు అందించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను విజిట్ చేసి భోజనం గది, వంట గదులను పరిశీలించి భోజనం మెనూ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎల్‌హెచ్ స్వప్న, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరావు, ఏఎన్ఎమ్ తులసి, ఆశాలు, వర్కర్స్ రామలక్ష్మి, కనక మహాలక్ష్మి డేటా ఆపరేటర్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ఒబలయ్యపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య సేవలు అందించారు. బొద్దాం పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ ఎస్ సతీష్ కుమార్, హెచ్ ఏ గాలి నాయుడు, వెంకటరావు, హెచ్‌సి మూర్తి, ఏఎన్ఎం గౌరీ లక్ష్మి, ఆశాలు రామలక్ష్మి, లక్ష్మి, డిఇఒ కే మోహన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి- బొబ్బిలి

గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ మంగళవారం పర్యటించారు. పదో వార్డులో కాలువలు, వీధి దీపాలు సమస్య ఉండడంతో కాలువలో పూడికలు తొలగించాలని శానిటేషన్ సిబ్బందికి, వీధి దీపాలు వేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, వైసిపి కార్యకర్తలు, మున్సిపల్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

మధ్యాహ్న భోజనాల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం అమలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం, నాణ్యతగా పెట్టాలన్నారు. అనంతరం నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఆయనతో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో జరుగుతున్న 2వ విడత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాసన స్థాయిని మెరుగుపరచడానికి కృషి చేయాలని సూచించారు. 3,4,5 తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు ఉదయం సాయంత్రం ప్రత్యేక శిక్షణను ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. శిక్షణలో భాగంగా తెలుగు, గణితంలో టెస్టులను నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రమణమూర్తి, రిసోర్స్ పర్సన్ గౌరీ శంకర్, వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీని ప్రగతి పథంలో నడిపించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామ పంచాయ తీని ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఉదయం కాట కాపల్లి సచివాలయాన్ని సంద ర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడేలా మనమంతా కృషి చేయాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డ నాటి నుంచి గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాట పట్టాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చినరావుపల్లి సర్పంచ్ బుసాల దేముడు, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వేపాడ మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగన్నాధం, కాటకాపల్లి చిన్నం నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఎన్నికల ప్రకటన

శ్రీ వెంకటేశ్వర ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్, ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నెం.వి.ఆర్.110, దాసన్నపేట, విజయనగరం యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నికలు తే.11-12-2022 దిన ఆదివారం విజయనగరం సంఘ కార్యాలయము వద్ద జరుపబడునని సంఘ సభ్యులందరికీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

1. ఎన్నిక కావలసిన పాలకవర్గ సభ్యులు	- 9 (తొమ్మిది) (రిజర్వేషన్లు లేవు)
2. నామినేషన్లు దాఖలు చేయు తేది	- 01-12-2022 గురువారం ఉదయం గం. 10.00 ల నుండి సాయంత్రం గం.5.00ల వరకు
3. నామినేషన్లు రుసుము ఎస్సీ, ఎస్టీలకు	- రూ. 100/-లు
బి.సి. లకు	- రూ. 200/-లు
ఓ.సి. లకు	- రూ. 400/-లు
4. నామినేషన్లు పరిశీలన తేది	- 02-12-2022 శుక్రవారం ఉదయం గం. 10.00ల నుండి
5. నామినేషన్లు ఉపసంహరణ తేది	- 03-12-2022 శనివారం ఉదయం గం. 10.00 ల నుండి సాయంత్రం గం. 5.00 ల వరకు
6. ఎన్నికల తేది	- 11-12-2022 ఆదివారం ఉదయం గం. 7.00 ల నుండి మధ్యాహ్నం గం. 2.00 ల వరకు
7. ఎన్నికల ఫలితాల ప్రకటన తేది	- 11-12-2022 మధ్యాహ్నం గం. 2.00 ల తర్వాత ఓట్లు లెక్కింపు
8. ఆఫీసు బేరర్ల ఎన్నిక తేది	- 13-12-2022 (అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శిని ఎన్నిక)

సం/- డి.ఆర్.ఎస్. ప్రసాదరావు
ఎన్నికల అధికారి
డిప్యూటీ రిజిస్ట్రారు (రిటైర్డ్)/సహకార శాఖ
శ్రీ వెంకటేశ్వర ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్. ఎంప్లాయిస్
కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, విజయనగరం

తే. 28-11-2022 ది
విజయనగరం

ప్రభుత్వ జిఒ ఆశ్చర్యాన్ని కలిగించింది

సర్పంచ్ వెంకటలక్ష్మి

వేపాడ : ప్రభుత్వ జిఒ తనను ఆశ్చర్యానికి గురి చేసిందని మండలంలోని పాటూరు సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులకు పంచాయతీ నిధులు నుండి వేతనాలను ఇవ్వాలని జిఒ ఇవ్వడం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. పంచాయతీకి గత రెండు సంవత్సరాలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11 లక్షలు మాత్రమే వచ్చాయని ఆ నిధుల్లో ఇప్పటికే రూ.3.60 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఇందులో విద్యుత్ బిల్లు రూ.73 వేలు చెల్లించామన్నారు. తొమ్మిది నెలలకు గాను పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలంటే రూ.1.60లక్షలు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఈ జిఒ రాకముందే పంచాయతీ తీర్మాణంతో చాకలిపేటకు కాలువ పనులు, ఎస్‌డబ్ల్యూపి షెడ్డుకు వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణం, పెన్సింగ్ ఏర్పాటు, ఎస్‌సి కాలనీకి రెండు సీసీ రోడ్డు నిర్మాణం పనులు, ఉమ్మడి వీధిలో కాలువ నిర్మాణం పనులు, రాజ వీధి కాలువ నిర్మాణ పనులకు సిద్ధమయ్యామన్నారు. ఈ పనులు చేయడానికి సుమారు రూ.20 లక్షలు నిధులు అవసరమవుతాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కావలసిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులకు 15 ఫైనాన్స్ నుండి వేతనాలు ఇవ్వాలని జీవో ఇవ్వడంలో అర్థం లేదన్నారు. జీతాలు పంచాయతీ చెల్లిస్తే అభివృద్ధి కుంటిపడిపోతు ఒదన్నారు. పారిశుధ్య కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి పంచాయతీ నిధులకు సంబంధం లేకుండా చూడాలని కోరారు.

మహిళతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి : పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని నాగసపువీధి, షాదిఖాన, శ్రీరామ్ నగర్ కాలనీలో పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లు, కాలువలు శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను కోరారు. మహిళలతో మాట్లాడి పారిశుధ్య కార్మికుల పనిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు పనులను పరిశీలించారు.